సాక్షి నంద్యాల

మంగళవారం ; 28 ; నవంబర్ ; 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన టి.శ్రీకాంత్, కుటుంబసభ్యులు రూ.2,00,000 విరాళంగా అందజేశారు.



సుంకేసులకు పెరిగిన ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శ్రీశైలానికి 1,824, కేసీ కాల్వకు 2,354 క్యూసెక్కులను వదిలారు.



దరఖాస్తుల వెల్లువ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ ల్లో పలు పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు అభ్యర్థుల నుంచి భారీగా స్పందన వస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

ప్రస్తుత పైర్లకు మాత్రమే నీరు

నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని సాగునీటి కాలువల కింద ప్రస్తుతం సాగులో ఉన్న పైర్లకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని జిల్లా జల వనరుల శాఖాధికారి వెంకట రమణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలోని పలు జలాశయాల్లో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలుగుగంగ కాలువకు నవంబర్ నెలాఖరు వరకు, కేసీ కాలువకు డిసెంబర్ 10 వరకు, ఎస్సార్బీసీ కాలువకు డిసెంబర్ నెలాఖరు వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ మూడు ప్రధాన కాలువలలో పరిధిలో రబీకి ఎట్టిపరిస్థితుల్లోనూ నీటి విడుదల ఉండదన్నారు.

జోరుగా ఎండు మిర్చి కొనుగోళ్లు

నంద్యాల(సెంట్రల్): జిల్లా కేంద్రంలోని టెక్కె మిర్చి మార్కెట్‌యార్డులో ఎండుమిర్చి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. సోమవారం సూపర్-10 రకం మిర్చి గరిష్ఠ ధర క్వింటాలు రూ.21,600, మధ్యస్థ ధర రూ.20,200, కనిష్ఠ ధర రూ.18,500గా పలికింది. ఇదే రకం తాలు కాయ గరిష్ఠ ధర రూ.10,600, మధ్యస్థ ధర రూ.10,000, కనిష్ఠ ధర రూ.8,000గా నమోదైనట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. రైతన్నలు దళారులను నమ్మి మోసపోకుండా మిర్చి యార్డును సద్వినియోగం చేసుకుని మంచి ధరను పొందాలని సూచించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



హాసిని

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని డి. హాసిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాలిహా బేగం సోమవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి 67వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో కర్నూలు జిల్లా కబడ్డీ జట్టు కెప్టెన్‌గా విద్యార్థిని డి. హాసిని ప్రతిభ కనబరిచింది. లీగ్ స్థాయిలో నెల్లూరు, విశాఖపట్నం జిల్లాలపై విజయ సాధించి క్వాటర్ ఫైనల్‌లో విజయనగరంపై విజయం సాధించింది. కాగా సెమీఫైనల్‌లో చిత్తూరు జిల్లా జట్టు చేతిలో ఓటమి చెందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి. హాసిని రాష్ట్ర స్థాయి జట్టులో చోటు దక్కించుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



పాతాళగంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తజనం (ఇన్‌సెట్) నదిలో దీపాన్ని వదులుతున్న భక్తురాలు



ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ వెలుగులు

ఇల కైలాసం.. కార్తీక శోభితం

- కార్తీక రెండవ సోమవారం భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి
- పాతాళగంగలో పుణ్యస్నానాలు
- కనుల పండువగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి
- స్వామిఅమ్మవార్లను దర్శించి.. తరించిన భక్తజనం



భ్రమరాంబా సహిత మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న వేద పడింతులు

శ్రీశైలంటెంపుల్: లక్ష దీపాల వెలుగుల మధ్య ముక్కంటిని భక్త కోటి మనసారా స్మరించుకుంది. కార్తీక వెలుగులు ప్రజ్వరిల్లుతుండగా భక్తజనం శ్రీశైల మల్లన్నను కనులారా దర్శించుకున్నారు. కార్తీక రెండవ సోమవారం ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం వరకు పౌర్ణమి ఘడియలు ఉండడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేల సంఖ్యలో పరమేశ్వరుడి దర్శనానికి తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు వేకువజాము నుంచే శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులకు స్వామిఅమ్మవార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ) మాఢవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే కొంతమంది భక్తులు లక్ష వత్తులు వెలిగించి నోములు నోచుకున్నారు. క్యూలైన్లలో, కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు బిస్కెట్లు, అల్పాహారం అందించారు.

కోటి కాంతులు.. దశ విధ హారతులు

ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతిని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేయడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను శాస్త్రోక్తంగా ఇచ్చారు. భక్తులు హారతులను కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించి నేత్రానందభరితులయ్యారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఆకాశంలో చంద్రుడికి చంద్ర హారతి ఇస్తున్న అర్చకులు



గంగాధర మండపం వద్ద దీపారాధనలో భక్తురాలు

‘ఐదు క్రీడాంశాల్లో ‘ఆడుదాం ఆంధ్ర’

- ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల నిర్వహణ
- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



బ్రోచర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీలు

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమంలో భాగంగా ఐదు క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆడుదాం ఆంధ్ర లోగో, మస్కట్, బ్రోచర్, ఆన్‌లైన్ ప్లేయర్స్ రిజిస్ట్రేషన్ లింక్‌ను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలు ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ 5 అంశాలలో పోటీలను గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 15 ఏళ్ల పైబడిన ఆసక్తి కలిగిన సచివాలయంలో, ఆన్‌లైన్‌లో https://aadudamandhra.ap. gov.in/login ద్వారా నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. రిజిస్టర్ కోసం 1902 నంబర్‌కు చేయవచ్చన్నారు. క్రీడా సామగ్రిని ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించందని, వారంలోపు అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు చేర్చుతామన్నారు. ఇప్పటికే క్రీడలు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. క్రీడా మైదానాలను సిద్ధం చేశానమ్నారు. సచివాలయం స్థాయి, మండల స్థాయిలో ఆడి గెలిచిన జట్లకు క్రీడా కిట్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నాలుగు అంశాల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.35వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు ఇస్తారన్నారు. అలాగే జిల్లా స్థాయి విజేతలకు వరుస మూడు బహుమతులు రూ. 60 వేలు, రూ. 30 వేలు, రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడో బహుమతి రూ.2 లక్షలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. బ్యాడ్మింటన్‌లో నియోజకవర్గ స్థాయి మొదటి మూడు విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ. 5వేలు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయి విజేతలకు మొదటి బహుమతి 15వేలు, రెండో బహుమతి 20వేలు, మూడో బహుమతి 10 వేలు. అలాగే రాష్ట్రస్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ. 2 లక్షలు, రెండో బహుమతి రూ. లక్ష, మూడో బహుమతి రూ.50వేలు ఇస్తారని చెప్పారు. జిల్లాలో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి వివిధ శాఖలను సమన్వయం చేస్తున్నామన్నారు. ఇందులో ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ పీఈటీలు, రవాణా శాఖ, సివిల్ సప్లై తదితర శాఖలు వారి సిబ్బంది క్రీడల్లో సమన్వయం చేస్తారని చెప్పారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నేడు శంకుస్థాపన

- వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ లోఓల్టేజీ సమస్యను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు ట్రాన్స్‌కో 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఈ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం ముత్యాలపాడు వద్ద రూ.138.59 కోట్లు, పాణ్యం నియోజకవర్గం గడివేముల వద్ద రూ.98.65 కోట్లు, ఎమ్మిగనూరు నియోజకవర్గం బనవాసి వద్ద రూ.148కోట్లతో ఈ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

ప్రజలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుది

- పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న ప్రభుత్వ ధ్యేయం
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- రూ.19.5 కోట్లతో డోన్ - వెంకటాపురం రోడ్డు ప్రారంభం
- రూ.2కోట్లతో నిర్మించిన హెల్త్‌క్లినిక్, ఆర్‌బీకే, సచివాలయ భవనాలు ప్రారంభం



డోన్ - వెంకటాపురం నూతన రహదారిపై పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: ‘రుణమాఫీ హామీ ఇచ్చి రైతులు, పొదుపు మహిళ గ్రూపులను మోసం చేసిన చరిత్ర టీడీపీ అధినేత చంద్రబాబుది. మళ్లీ బూటకపు వాగ్దానాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే ఎవరూ నమ్మరు’ అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ పట్టణం నుంచి వెంకటాపురం గ్రామం వరకు రూ.19.5 కోట్లతో నిర్మించిన నూతన రహదారిని మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఈ రహదారిపై పాదయాత్ర చేసి వెంక టాపురం మీదుగా మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.22 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం, రూ.17 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఆకర్షణీయమైన అబద్దాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట అనే సంగతిని ప్రజలు మరిచిపోలేదన్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన చంద్రబాబును 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్నారు. పొదుపు మహిళలతో పాటు రైతులకు రుణమాఫీ అని, పసుపు కుంకుమ కింద రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఇచ్చి నమ్మించాలని చూసినా రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా విశ్వసించలేదనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ఖజానాకు పన్ను రూపంలో ప్రజలు చెల్లించినంత సొమ్మునంతా సైకిళ్లు, టోపీలు, పనిముట్ల పంపిణీల పేరుతో పేదలను మరింత పేదలుగా మార్చారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలందరినీ ధనవంతులను చేయాలనే లక్ష్యంతో కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చిందన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడాను గమనించి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందామని మంత్రి బుగ్గన పిలుపునిచ్చారు. గ్రామంలో రెండు వర్గాల ప్రధాన నాయకులైన సుధాకర్‌రెడ్డి, బోయ హనుమన్నలు మంత్రి బుగ్గనను గజమాలతో సత్కరించడమే కాకుండా మంత్రి కోరిక మేరకు కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని హామీనిచ్చారు.



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మాయ మాటలకు మోసపోవద్దు..

టీడీపీ నాయకుల అసత్యపు ప్రచారాలు, మాయ మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రజలకు సూచించారు. గుమ్మకొండ గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేవలం అసత్యాలనే ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి చేస్తున్నవన్నీ అధర్మం పనులేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ధ్వజమెత్తారు. 50 ఏళ్లల్లో జరగని అభివృద్ధి మంత్రి బుగ్గన కేవలం నాలుగేళ్లల్లో నియోజకవర్గంలో చేసి చూపించారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్ అన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తకోట చంద్రన్న, సింగిల్ విండో చైర్మన్ తిరునాంపల్లె తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పంచాతీరాజ్ ఏఈ రామక్రిష్టారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణ, వ్యవసాయ శాఖ ఏడి అశోక్‌వర్ధన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేయండి

- ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి, చిత్రంలో కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్, ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్ఓ, ఎఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల సవరణలకు సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పక్కా రికార్డులు నిర్వహించాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓలకు సూచించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తు.చ తప్పక వంద శాతం పాటిస్తూ ప్రొసీజర్ ప్రకారం తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితాలో కరెక్టే ఉన్నప్పటికీ ప్రొసీజర్ ఫాలో కాకపోవడం వల్ల ఇటీవలే ఇద్దరు అధికారులను కూడా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో నమోదుకు సంబంధించి 100, తొలగింపులకు సంబంధించి 100, చేర్పులు మార్పులకు సంబంధించి 50 క్లెయిమ్స్‌ను ర్యాండముగా తనిఖీ చేస్తానన్నారు. ప్రొసీజర్ ఫాలో కాకుండా పక్కా డాక్యుమెంటేషన్ లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, నమోదుపై సాధారణ రీతిలో నోటి మాటగా కాకుండా నిర్దిష్టమైన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదులు అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తప్పుడు సమాచారం, ఫిర్యాదులు అందిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం సంబంధిత వ్యక్తులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. డెత్ ఓటర్స్ ఉంటే సంబంధిత వ్యక్తుల సమాచారం ఇస్తే పంచనామా నిర్వహించి డెత్ ఓటర్స్‌ను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి జిల్లా జనాభా, ఓటర్ల వివరాలు, పోలింగ్ స్టేషన్లు, ఈపీ రేషియో, జెండర్ రేషియో 18-19 సంవత్సరాల యువ ఓటర్లు, పీడబ్ల్యూడీ ఓటర్స్ తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్టోరల్ అబ్జర్వర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నుంచి అమృతరాజ్, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, సీపీఎం నుంచి నరసింహ, కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ రియాజ్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సేవలో..



మహానందికి వచ్చిన శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్రస్వామి

మహానంది: మహానందీశ్వరస్వామిని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్రస్వామి సోమవారం రాత్రి దర్శించుకున్నారు. క్షేత్రానికి స్వామీజీకి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, పండితులు స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం పల్లకీసేవలో పాల్గొన్నారు. ఆయన వెంట మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక కాంతులు


పగిడ్యాల: లింగాకృతిలో వెలిగించిన దీపాలు


మంత్రాలయం: వేడుకలు తిలకిస్తున్న భక్తులు


ఉత్సవమూర్తికి హారతిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి


మంత్రాలయం: తుంగభద్ర నదీతీరంలో దీపోత్సవ దృశ్యం


శ్రీశైలం: క్యూలైన్లలో భక్తుల రద్దీ


విద్యుత్ దీపకాంతులలో స్వామి అమ్మవార్లు, కార్తీక పౌర్ణమి చంద్రుడు


కొత్తపల్లి: సంగమేశ్వరంలో భక్తుల సందడి


వెలుగోడు: వేల్పనూరులో జ్వాలాతోరణోత్సవం


ఆస్పరి: లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

కార్తీక రెండో సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. దీపారాధనతో ప్రముఖ క్షేత్రాలు శోభిల్లాయి. పౌర్ణమి ఘడియలు మధ్యాహ్నం వరకు ఉండటంతో భక్తులు నదులు, కాలువల్లో దీపాలు వదిలి భక్తిభావాన్ని చాటుకున్నారు. శివునికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పలుచోట్ల లక్ష దీపోత్సవాలను కన్నుల పండువగా జరిపారు. జ్వాలాతోరణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రాలయం, శ్రీశైలంలో వేడుకలు వెలుగులీనాయి.

–సాక్షినెట్‌వర్క్


కర్నూలు: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, ఎస్పీ కృష్ణకాంత్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు


హొళగుంద: సాయిబాబా మందిరంలో దీపోత్సవం


యాగంటిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

టీడీపీ నేత బీసీ జనార్దన్‌రెడ్డికి భంగపాటు

- టీడీపీ నాయకుల అత్యుత్సాహం
- ఎదురు తిరిగిన గ్రామస్తులు

కోవెలకుంట్ల: బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో సోమవారం రాత్రి భంగపాటు ఎదురైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామంలో బీసీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్లారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సోముల సతీష్‌రెడ్డికి ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేయడంతో న్యాయబద్ధంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. జీర్ణించుకోలేని గ్రామ టీడీపీ నాయకులు ఆ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవాలని, పడగొట్టాలని కక్ష కట్టి ఆ ప్రదేశానికి బీసీ జనార్దన్‌రెడ్డిని పిలుచుకుని వెళ్లి హల్‌చల్ చేసేందుకు ప్రయత్నించారు. గమనించిన కాలనీ వాసులు అక్కడకు చేరుకుని ప్రతిఘటించారు. దీంతో బీసీ సొంతపార్టీ నాయకులను మందలించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామ టీడీపీ నాయకుల కుతంత్రంపై ప్రజలు తిరగబడటంతో అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్స్ అరెస్ట్

- 24 తులాల బంగారు చైన్లు స్వాధీనం


చైన్‌స్నాచర్స్ అరెస్ట్ చూపుతున్న జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్స్‌ను సోమవారం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన మోహన్‌నాయక్ అలియాస్ కిషోర్ నాయక్, శ్రీకాంత్‌లు స్నేహితులు. జల్సాలకు అలవాటుపడి చైన్‌స్నాచింగ్ చేయడం మొదలు పెట్టారు. బైక్‌పై హెల్మెట్, మాస్కులు ధరించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవారు. వీరిపై నంద్యాల, కర్నూలు జిల్లాలతో పాటు తెలంగాణాలో మొత్తం 10 కేసులు నమోదయ్యాయి. ఆత్మకూరు సబ్‌డివిజన్‌లో 4 చోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడటంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా వీరి ఆచూకీ గుర్తించారు. సోమవారం ఉదయం భానుముక్కల గ్రామ శివారులో నంబర్ ప్లేట్ లేని బైక్‌పు తిరుగుతుండగా పోలీసులు గమనించి అదుపులోకి తీసుకుని విచారించారు. తాము పలు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డామని అంగీకరించటంతో వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి బంగారం కొనుగోలు చేసిన అన్సార్‌ను అరెస్ట్ చేసి 24 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. దొంగలను పట్టుకోవటంలో చాకచక్యం వహించిన డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగభూషణం, విజయభాస్కర్, ప్రకాష్, ఎస్‌ఐలు నారాయణరెడ్డి, అశోక్‌ను ఎస్పీ అభినందించారు.

ఆరోగ్యశాఖ పోస్టులకు దరఖాస్తుల వెల్లువ


దరఖాస్తులు ఇచ్చేందుకు భారీగా వచ్చిన అభ్యర్థులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి వైద్యశాలల్లో పలు పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు అభ్యర్థుల నుంచి భారీగా స్పందన వస్తోంది. దరఖాస్తుకు శనివారం చివరి రోజుగా నిర్ణయించిన అధికారులు అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో 29వ తేదీ వరకు గడువు పెంచారు. దీంతో సోమవారం సైతం అభ్యర్థులు భారీ సంఖ్యలో కర్నూలు మెడికల్ కాలేజీకి దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చారు. శనివారం నాటికి 3,460 మంది దరఖాస్తు చేయగా సోమవారం ఒక్కరోజే 3 వేలకు పైగా అభ్యర్థులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థుల రద్దీ ఎక్కువ కావడంతో సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మిగిలిన వారిని మంగళవారం రావాలని పంపించి వేశారు.

ఎస్‌ఏ పరీక్షలతో సామర్థ్యాల మదింపు

- నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు
- మండల కేంద్రాలకు చేరిన ప్రశ్నాపత్రాలు
- జిల్లాలో 1902 ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు 400
- పరీక్షలు రాయనున్న 2,16,000 మంది విద్యార్థులు


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు పంపిణీ చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం గమనార్హం. 1 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు బైలింగ్వల్ విధానంలో, పదోతరగతి వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేస్తారు. ఎస్‌ఏ–1 పరీక్షలకు విద్యా శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయటపడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

గత ఏడాది మాదిరిగానే..

గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పరీక్ష పేపర్ల మూల్యాంకనం, పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేందుకు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు షెడ్యూల్ ఇచ్చింది. జనవరిలో ఫార్మేటివ్-3, మార్చిలో ఫార్మేటివ్-4, ఏప్రిల్లో 1 నుంచి 9 తరగతులకు ఎస్‌ఏ-2, మార్చిలో పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లిష్‌పై విద్యార్థులు పట్టు సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా, తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్టీ పంపిణీ చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

- 1–5 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లిష్, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లిష్ పార్ట్–బీ టోఫెల్ పరీక్ష
- 6–10 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లిష్, 4న గణితం
- డిసెంబర్ 5న 6–7 తరగతులకు జనరల్ సైన్స్, 8–10 తరగతులకు పీఎస్
- డిసెంబర్ 6న 8–10 తరగతులకు బీఎస్, 7న సోషల్ స్టడీస్, 8న ఇంగ్లిష్ పార్ట్–బీ టోఫెల్ పరీక్ష

పరీక్ష సమయం

- 1–5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు
- 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు

ప్రశ్నా పత్రం మార్కులు

- 1–8 తరగతులకు 80 మార్కులు, 9, 10 తరగతులకు 100 మార్కులు

ప్రశ్న పత్రాల పంపిణీ పూర్తి



జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యా కేంద్రాలకు చేరవేశాం. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్నపత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపరిచారు.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

జిల్లాలో ఎస్‌ఏ–1 పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలు..

ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల్లో	80,000
ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల్లో	76,000
ప్రైవేటు పాఠశాలలో 1 నుంచి 10 తరగతులు	60,000
మొత్తం విద్యార్థులు	2,16,000

మల్లన్న సేవలో మంత్రి ఆర్‌కే రోజా


స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వెళ్తున్న మంత్రి ఆర్‌కే రోజా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 30 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఫెయిల్ అయిన ప్రైవేటు విద్యార్థులందరూ జరిమానా లేకుండా ఈనెల 30వ తేదీలోగా ఫీజులు చెల్లించవచ్చని ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి సోమవారం తెలిపారు. నంద్యాల జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రిన్సిపాళ్లు, కళాశాలల ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి ఎంత మంది ఫీజు చెల్లించారు, ఎందరు చెల్లించలేదు, కారణాలు ఏమిటని వివరాలను తమ కార్యాలయానికి మెయిల్ ద్వారా పంపించాలని ఆదేశించారు. ఫెయిల్ అయిన విద్యార్థులందరితో ఫీజు కట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ పాస్ అయిన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంస్థ అన్ని కళాశాలలో అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఈ అంశంపై కూడా విద్యార్థులను ప్రిన్సిపాళ్లు ప్రోత్సహించి వచ్చే నెలలో జరిగే పరీక్షకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌కు, పరీక్ష రాసేందుకు ఎటువంటి ఫీజు లేదన్నారు. పరీక్ష తేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఉపాధికూలీ మృతి


మిద్దె వెంకటరమణ (ఫైల్)

కొత్తపల్లి: దుద్యాల గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మిద్దె వెంకటరమణ (58) ఉపాధి పనులు చేస్తూ గుండె పోటుతో మృతి చెందాడు. సోమవారం గ్రామ శివారులో ఇస్కాల రోడ్డులో రహదారికి ఇరువైపులా కంపచెట్లు తొలగిస్తుండగా గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలిపోయాడు. తోటి ఉపాధి కూలీలు హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతునికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడు వెంకటరమణ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూస్తామని ఏపీఓ రేష్మ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన షేక్ షాహిద్ హుసేన్, బేగం దంపతులకు కుమారుడు హుసేన్‌బాషా (25) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కూరగాయల కోసం ఆదివారం రాత్రి నందికొట్కూరుకు బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తుండగా జగనన్న కాలనీ వద్ద బైక్‌ను ఆటో ఢీకొట్టింది. తీవ్రగాయాలకు గురైన యువకుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.